# సాక్షి నిజామాబాద్

బుధవారం । 28 । ఆగస్టు । 2024






## 'సమగ్ర' ఉద్యోగుల పోరుబాట

విద్యారంగంలో కీలక పాత్ర పోషించే సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు పోరుబాట పట్టారు. నేడు మహార్యాలీ నిర్వహించనున్నారు.

- 8లో ▸



## అందుబాటులో ఉండాలి

ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యులకు అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.2 /21.7

## వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### రేపు జాబ్ మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బీపీ మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నామని, సదరు కంపెనీలో ఎగ్జిక్యూటీవ్, రిలేషన్‌షిప్ మేనేజర్, సూపర్‌వైజర్, అడ్వైజర్ ఉద్యోగాలు భర్తీ చేస్తారని పేర్కొన్నారు. డిప్లొమా ఐటీఐ, డిగ్రీ, బీటెక్, ఎంఈ ఉత్తీర్ణులైన వారు శివాజీనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్న జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు 95817 68413, 99487 48428, 63057 43423, 77022 59070 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాం సాగర్ ప్రాజెక్ట్‌లోకి 23,414 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతుండగా, కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మికాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 578 క్యూసెక్కులు పోతుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 1084.50(58.35 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

### 1న క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

ఆర్మూర్‌టౌన్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ స్కూల్‌లో సెప్టెంబర్ 1న జిల్లా స్థాయి అండర్‌–19 క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జి నయీం, ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జి, కోచ్ రతన్ తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు పదో తరగతి, జనన ధ్రువీకరణ పత్రాలతోపాటు సొంత క్రికెట్ కిట్లను వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 83175 95377, 91334 46727 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### మరోసారి జీజీహెచ్ డైట్ టెండర్ వాయిదా

నిజామాబాద్‌నాగారం : జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సంబంధించిన డైట్ టెండర్ ప్రక్రియ మళ్లీ వాయిదా పడింది. అదనపు కలెక్టర్ అంకిత్ చాంబర్‌లో మంగళవారం టెండర్లు దాఖలు చేసిన వారితో సమీక్షించారు. మొత్తం 11 దరఖాస్తులు రాగా, ఐదు దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. మిగతా ఆరు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వారం రోజుల్లో టెండర్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీజీహెచ్ ఏడీ రాజశేఖర్ తెలిపారు. కాంట్రాక్ట్ దక్కించుకోవడానికి పోటీ పడుతున్న వారిలో అర్హులను గుర్తించేందుకు అధికారులు కుస్తీపడుతున్నారు. టెండర్ ప్రక్రియ ఇప్పటికే రెండుసార్లు వాయిదాపడిన విషయం తెలిసిందే.

### పీజీ పరీక్షలు ప్రారంభం



తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో మంగళవారం పీజీ రెండవ సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ కోర్సెస్ 8వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్, బీఎల్ ఐఎస్సీ బ్యాక్ లాగ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వర్సిటీ మెయిన్ క్యాంపస్, సౌత్ క్యాంపస్ భిక్కనూర్, జీజీ కాలేజ్ నిజామాబాద్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ కామారెడ్డి, బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, ఆర్మూర్ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం వర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించిన పరీక్షను రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ ఆరతి పరిశీలించారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 1,808 మందికి 1,687 మంది హాజరు కాగా 121 మందివిద్యార్థులు గైరాజయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ పేర్కొన్నారు.

**సౌత్‌క్యాంపస్‌లో..**

భిక్కనూరు: తెయూ సౌత్‌క్యాంపస్‌లో పీజీ రెండో సెమిస్టార్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. క్యాంపస్‌లో నిర్వహించిన పరీక్షకు 173 మంది విద్యార్థులకు ఆరుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ తెలిపారు.



అర్సపల్లిలోని రామర్తి చెరువులో భవన నిర్మాణాలు (ఫైల్)

# హైడ్రా మాదిరి నిడ్రా కావాలి..

- నగరంలో వినిపిస్తున్న డిమాండ్
- విచ్చలవిడి ఆక్రమణలే కారణం
- నిబంధనలను తుంగలో తొక్కి అనుమతులిచ్చిన 'టౌన్‌ప్లానింగ్'
- అన్నీ తెలిసి పట్టించుకోని కీలక అధికారులు
- ముడుపుల్లో వాటాలే కారణమంటూ విమర్శిస్తున్న ప్రజలు

నిజామాబాద్ జిల్లాలోనూ 'హైడ్రా' మాదిరిగా 'నిడ్రా' (నిజామాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) ఏర్పాటు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి. ఎక్కడ చూసినా నగర ప్రజలు దీనిపైనే చర్చలు జరుపుతుండడం విశేషం. 'నిడ్రా' ఏర్పాటు చేసి సహజ వనరులను గుర్తించి, అవి గతంలోఎంత విస్తీర్ణంలో ఉండేవి, ఇప్పుడు ఎంతమేర ఉన్నాయో గుర్తించాలంటున్నారు. ఆక్రమణకు గురయ్యాయా.. ఎంత విస్తీర్ణం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లాయనే విషయమై పాత మ్యాపులు, క్షేత్రస్థాయిలో తాజా పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేయాలని, ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో విచ్చలవిడిగా చేసిన ఆక్రమణలపై యుద్ధప్రాతిపదికన చర్యలకు దిగాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాలు ఎంతటి స్థాయి, పలుకుబడి ఉన్న వ్యక్తులవయినప్పటికీ ఉపేక్షించకుండా ముందుకెళ్లాలని అంటున్నారు.

రాష్ట్రంలోని నగరపాలక సంస్థల్లో గ్రేటర్ హైదరాబాద్ తర్వాత అత్యధిక ఆక్రమణలు జరిగింది నిజామాబాద్‌లోనేనని పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో ఆక్రమణలు చేసినప్పటికీ వాటికి అనుమతులు ఇచ్చిన అధికారులను ఎందుకు కాపాడుతున్నారు ? ఎవరు కాపాడుతున్నారనే విషయమై విశ్లేషణ చేసి తగిన చర్యలకు ఉపక్రమించాల్సిన ఆవశ్యకత ఉందని వాదనలు వస్తున్నాయి. నగరంలో మురుగునీటితో పాటు వరద నీరు స్వేచ్ఛగా బయటకు వెళ్లేందుకు ప్రకృతి ప్రసాదించిన పులాంగ్ వాగును అడుగడుగునా కబ్జా చేయడంతో అది కాస్తా పిల్లవాగు మాదిరిగా మారిపోయింది. దీంతో పాటు నగరంలోని రామర్తి చెరువు, బొడ్డెమ్మ చెరువు, బ్రహ్మ చెరువు, నిజాంసాగర్ కెనాల్, ఇతర నీటి కుంటలు, నాలాలు, డ్రెయిన్లు, పలుచోట్ల అంతర్గత రోడ్లు, మున్సిపల్ పార్కులు ఆక్రమణకు గురయ్యాయి. కాగా వీటన్నింటికీ మున్సిపల్ అధికారులు క్రమబద్ధీకరణ అనుమతులు ఇవ్వడం విశేషం.

ఇదిలా ఉంటే మరోవైపు కమర్షియల్ కాంప్లెక్స్‌లు, భవన నిర్మాణాల అనుమతుల విషయంలో ప్రభుత్వానికి పిసరంత ఫీజు మాత్రమే చెల్లించేలా మాయాజాలం చేసిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తమ బొక్కసాలు మాత్రం భారీగా నింపుకోవడం గమనార్హం. సదరు నిర్మాణాలకు సంబంధించి సెట్‌బ్యాక్, సెల్లార్ అనుమతులు, పార్కింగ్ సౌకర్యం లేకున్నప్పటికీ.. ఇచ్చిన అనుమతి కంటే ఎక్కువ చదరపు అడుగుల్లో నిర్మాణం చేసినప్పటికీ.. అనుమతులు ఉన్నదానికంటే రెండు నుంచి మూడు అంతస్తులు అదనంగా నిర్మాణం చేసినప్పటికీ.. ముడుపులు తీసుకుని అధికారులే సహకరించడం చెప్పుకోదగ్గ అంశం. ఈ విషయాలపై ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు రాగా ముడుపుల్లో వాటాలు తీసుకుని తమకేమీ తెలియదన్నట్లు, అంతా సక్రమమేనన్నట్లుగా కలరింగ్ ఇస్తున్నారని, ఏమాత్రం చర్యలు తీసుకోపోగా మరింతగా అక్రమాలను ప్రోత్సహిస్తూ అక్రమార్కులైన అధికారులను కాపాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో కిందిస్థాయి టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు విచ్చలవిడిగా పేట్రేగిపోయి, మాఫియా మాదిరిగా వ్యవహారాలు నడిపి రూ.కోట్లలో దండుకుంటున్నారు. పలువురు టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు రూ.వందల కోట్ల మేర ఆస్తులు సంపాదించారనేది బహిరంగ రహస్యంగా ఉంది. ఈ విభాగాల్లో కిందిస్థాయి అధికారులకే బినామీలు ఉన్నారంటే మామూలు విషయం కాదని ప్రజలు చెబుతున్నారు. ఇటీవల ఏసీబీకి చిక్కిన నరేందర్ ఆస్తులే రూ.వంద కోట్ల పైన ఉంటాయని, ఇక టౌన్ ప్లానింగ్ అధికారుల ఆస్తులు అంతకు రెండు మూడు రెట్లు ఉంటాయనే చర్చ నడుస్తోంది. ప్రభుత్వం హైడ్రా మాదిరిగా నిడ్రా ఏర్పాటు చేసి రంగంలోకి దిగితే అన్ని అక్రమాలు వెలుగుచూస్తాయని సామాన్యులు అంటున్నారు. అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారులను సర్వీసు నుంచి తొలగించాలని కోరుతున్నారు.

### కలెక్టర్ నేతృత్వంలో అమలు చేయాలి



జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిజామాబాద్ నగర పరిధిలో నిడ్రాను హైదరాబాద్‌లో మాదిరిగా పకడ్బందీగా అమలు చేయాలి. నగరంలో చెరువులు, కుంటలు, కెనాల్స్ పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. కబ్జాల వెనుక అధికారుల పాత్ర కూడా ఉంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎవరైనా సరే నిడ్రాకు సహకరించవల్సిందే. ఎవరైనా సహకరించకుండా అడ్డుపడితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతా.

– డాక్టర్ కేశవులు, సైకియాట్రిస్ట్

### కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



నగర పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరైనా సరే ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే నిడ్రా ద్వారా తగిన చర్యలు చేపట్టాల్సిందే. ఇప్పటికే నగరంలో ఉన్న చెరువులు బొడ్డెమ్మ, రామర్తి, బ్రహ్మం చెరువులు, పూలాంగ్ వాగు, నిజాంసాగర్ కెనాళ్లు పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. అధికారులు నిష్పక్షపాతంగా నిడ్రాతో నిజాలు నిగ్గుతేల్చి ప్రభుత్వ భూములను కాపాడాలి.

– సయ్యద్ ఖైసర్, కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు

### వెంటనే కూల్చి వేయాలి



మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనేక ఆక్రమణలు జరుగుతున్నాయి. వీటిని అధికారులు కూల్చివేయాలి. జిల్లా కేంద్రంలో ఆక్రమణల వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లు, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయి. వీటిని పరిరక్షించాలంటే హైడ్రా తరహా నిజామాబాద్‌లో ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలి.

– శ్రీనివాస్, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు

### వెంటనే చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి. వీటికి అనుమతి ఇచ్చిన అధికారుల ను వదిలిపెట్టకూడదు. ప్రస్తుతం ఉన్న ఆక్రమణలను నిర్మూలించాలి. పూలాంగు వాగు, రామర్తి చెరువు వంటి విలువైన ప్రాంతాలను పరిరక్షిస్తే ఎంతో మేలు ఉంటుంది. ఇటీవల నగరంలో చిన్నారి అనన్య డ్రెయినేజీలో పడి మృతి చెందింది. ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్త పడాలి.

– అరుణ, ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు

# బీఆర్ఎస్‌లో హుషారు

**కవితకు బెయిల్ నేపథ్యంలో..**

- స్థానిక సంస్థల ఎన్నికల్లో లాభం చేస్తుందంటున్న నాయకులు, కార్యకర్తలు
- పటాకులు కాల్చి, సంబురాలు చేసుకున్న పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితకు ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో బెయిల్ రావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో హుషారు నెలకొంది. మంగళవారం జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తరువాత శ్రేణులు నిస్తేజంలోకి వెళ్లిన సమయంలో పులి మీద పుట్ర మాదిరిగా వరుసగా మరో షాక్ తగిలింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే కవితను లిక్కర్ కేసులో అరెస్టు చేయడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో స్తబ్ధత ఆవరించింది. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఒక్క ఎంపీ సీటు గెలవలేదు. దీంతో నైరాశ్యం ఆవరించింది. కవిత బెయిల్ కోసం పార్టీ నేతలు అనేకసార్లు కోర్టు మెట్లు ఎక్కినప్పటికీ నిరాశే ఎదురైంది. ఈ క్రమంలో తాజాగా బెయిల్ రావడంతో పార్టీ శ్రేణుల్లో ఒక్కసారిగా హుషారు వచ్చింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్నందున బెయిల్ తమకు చాలా ఊరటనిచ్చిందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రస్థానానికి గెలుపు విషయంలో మొదటి అడుగు వేయించినది ఉమ్మడి నిజామాబాద్ జిల్లానే కావడం గమనార్హం. ఇక్కడి నుంచే కవిత ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. 2019 ఎన్నికల్లో ఓటమి అనంతరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్నారు. ఓటమి తరువాత శ్రేణులు నిరాశతో ఉండగా.. రుణమాఫీ అంశంపై నాయకత్వం పోరాటాలకు రూపకల్పన చేసింది. పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై పోరుబాట పట్టిన నేపథ్యంలో తాజాగా కవితకు బెయిల్ రావడంతో రాష్ట్రవ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు జోష్‌లోకి వచ్చారు. ముఖ్యంగా ఉమ్మడి నిజామాబాద్ ఎమ్మెల్సీగా ఉన్న కవిత జైలు నుంచి బయటకు రావడంతో ఇక్కడ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇది తమకు లాభం చేస్తుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.



ఎమ్మెల్సీ కవిత క్యాంప్ కార్యాలయం ఎదుట జాగృతి, బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫీవర్ వార్డులు

- జీజీహెచ్‌లో 24గంటల వైద్య సేవలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పాలనాధికారి

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రితోపాటు అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో ప్రత్యేకంగా ఫీవర్ వార్డులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. సీజనల్ వ్యాధులబారిన పడిన వారికి మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని, ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ చికిత్స పొందుతున్న వారి వివరాలను రోజువారీగా తెప్పించుకుంటున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశామన్నారు. అలాగే ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జీజీహెచ్‌లో 24 గంటలపాటు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిర్ణీత రుసుమును మాత్రమే వసూలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయన వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ తదితరులున్నారు.

**ఆయా విభాగాల పరిశీలన.. రోగులతో సంభాషణ**


జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అవుట్, ఇన్ పేషెంట్ విభాగాలతోపాటు ఫీవర్ వార్డు, ఆపరేషన్ థియేటర్, శస్త్ర చికిత్స వార్డు, రక్తనిధి కేంద్రం, సెంట్రల్ ల్యాబ్, ఎలిసా టెస్ట్ సెంటర్, టీ హబ్ సెంటర్‌ను సందర్శించి పనితీరును పరిశీలించారు. ప్రతిరోజూ సగటున ఎంతమంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు.. వారిలో ఎంతమంది ఇన్ పేషంట్లుగా అడ్మిట్ అవుతున్నారు? డెంగీ, మలేరియా, విషజ్వరాలతో ఆస్పత్రిలో ఎంతమంది చికిత్స పొందుతున్నారనే వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌తో మాట్లాడి తెలుసుకున్నారు. మందులు, ప్లాస్మా, ప్లేట్‌లెట్ యూనిట్స్ అందుబాటులో ఉన్నాయా? అని ఆరా తీశారు. ఆయా విభాగాల పనితీరుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఫీవర్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యసదుపాయాల గురించి వాకబు చేశారు. ఆన్‌లైన్ ఓపీ రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, అధికారులకు పలు సూచనలు చేశారు. జీజీహెచ్‌లో మౌళిక వసతుల మెరుగుదలకు సంబంధించిన ప్రతిపాదనలపై అధికారులతో చర్చించి కీలక ఆదేశాలు జారీ చేశారు.



రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన డీఎంహెచ్‌వో రాజశ్రీ

# డెంగీతో ప్రాణాపాయం ఉండదు

- వైరల్ జ్వరాల నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి
- పరిమితికి మించి యాంటిబయోటిక్స్ వాడొద్దు..
- సొంత వైద్యం అసలే వద్దు
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో జనరల్ ఫిజీషియన్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ జలగం తిరుపతిరావు
- కార్యక్రమానికి అపూర్వ స్పందన



నిజామాబాద్‌నాగారం: డెంగీ, మలేరియా, చికున్‌గున్యాతోపాటు వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి సీజనల్ జ్వరాలతో ప్రాణాపాయం లేదని జనరల్ ఫిజీషియన్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ జలగం తిరుపతిరావు అన్నారు. పరిమితికి మించి యాంటిబయోటిక్స్ వాడొద్దని, అలాగే సొంత వైద్యం అసలే పనికిరాదని ఆయన సూచించారు. వైద్యుల సలహాలు, సూచనలను పాటిస్తూ వారు ఇచ్చిన మందులను వాడితే సరిపోతుందన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫోన్ ఇన్‌లో ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది.

■ చికున్ గున్యా, డెంగీ ఎలా వస్తాయి..డెంగీ అంటు వ్యాధా..
– శ్రీనివాస్‌గౌడ్, మహేశ్(రుద్రూర్), సత్యనారాయణ, కల్లూర్కి

✤ చికున్‌గున్యా, డెంగీ జ్వరాలు దోమల కారణంగా వస్తాయి. ఒకరికి కాటువేసిన దోమలు మరొకరికి కాటు వేయడం ద్వారా డెంగీ వ్యాప్తి చెందుతుంది. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి. సాయంత్రం వేళ ఇంటి కిటికీలు, తలుపులను మూసివేయాలి.

■ రెండు నెలలుగా జ్వరం వస్తోంది, అరి చేతులు, కాళ్లు మండుతున్నాయి.. – పోశెట్టి, కోటగిరి

✤ జ్వరం వస్తూపోతూ ఉంటే వైరల్ ఫీవరే.. నోరు చేదుగా ఉంటే భయపడొద్దు. వైద్యుడి వద్దకు వెళ్లి అరిచేతులు, కాళ్ల మంటలకు మందులు వాడండి. సొంతంగా ఎలాంటి మందులు వాడకూడదు.

■ డెంగీ బాధితులకు బొప్పాయి ఆకురసం తా గిపిస్తే మంచిదా..– శివకుమార్, కుర్నాపల్లి

✤ డెంగీతో బాధపడుతున్న వారికి బొప్పాయి ఆకు రసం తాగిపిస్తూ ప్రయోగాలు చేయొద్దు. బొప్పాయి, కివీపండ్లు మాత్రం తినిపించొచ్చు. అనవసరమైన ప్రయోగాలు చేసి ఆరోగ్యాలతో చలగాటం ఆడొద్దు. ఏదీ ఏమైనా వైద్యుల సలహాలు తీసుకోవడం మంచిది.

■ డెంగీ టెస్ట్ చేస్తే నెగెటివ్ వచ్చింది.. ఒళ్లు నొప్పులున్నాయి.. – శివదయ, సంగెం

✤ డెంగీ నిర్ధారణ కాకున్నా సీజనల్ వ్యాధుల కాలంలో ఒళ్లు నొప్పులు ఉంటాయి. నొప్పులు మూడు నుంచి నాలుగు వారాలకుపైగా ఉంటాయి. ఉపశమనం కోసం పారాసిటమల్, డోలో తీసుకోండి. యాంటి బయోటిక్స్ వాడొద్దు.

■ డెంగీ లక్షణాలను ఎలా తెలుసుకోవాలి..
– పులగం మోహన్, గౌతంనగర్

✤ విపరీతమైన జ్వరం, కనుగుడ్లు ఎర్రగా మారడం, చర్మంపై దద్దుర్లు, కడుపునొప్పి, మూత్రం నల్లగా రావడం, విపరీతమైన నొప్పులు ఉంటాయి. డెంగీతో ప్రాణాపాయం ఉండదు. తగిన సమయంలో వైద్యుల సలహాలు, సూచనలతో నయమవుతుంది.

సాక్షి
ఫోన్ ఇన్

■ పీహెచ్‌సీల్లో టెస్టులు చేయించుకున్నా రిపోర్టులు ఇవ్వడం లేదు. వారు ఇచ్చిన మందులతో జ్వరం తగ్గడం లేదు..
– రాజేశ్, నిజామాబాద్

✤ జ్వరం వస్తూపోతుంటే ఆందోళన చెందొద్దు. పీహెచ్‌సీల్లో టెస్టులు చేయించుకుంటే కచ్చితంగా రిపోర్టు ఇస్తారు. మీకు రిపోర్టు ఇవ్వకపోతే జీజీహెచ్‌కు వెళ్లి టెస్టులు చేయించుకోండి. మెరుగైన వైద్యం అందుతుంది.

■ దగ్గు, జ్వరం, చలి ఉంది. మందులు తీసుకున్నా తగ్గడం లేదు.. – రాజు, జన్నేపల్లి

✤ చలి, జ్వరం, దగ్గు ఉంటే వైద్యులను సంప్రదించాలి. చల్లని వస్తువులు తీసుకోవద్దు. గోరువెచ్చని నీటిని తాగడంతోపాటు తాజా పండ్లు తీసుకోవాలి.

■ జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు తగ్గడం లేదు..
– స్వామినాయక్, ఉపాధ్యాయుడు

✤ జ్వరం తగ్గినా ఒళ్లు నొప్పులు తగ్గడం లేదంటున్నారు. మీరు వైరల్ జ్వరంతో బాధపడ్డారు. ఒళ్లనొప్పులు మరో మూడునాలుగు వారాలుంటాయి. తగినంత విశ్రాంతి తీసుకోండి. శరీరంలో నీటిశాతాన్ని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి.

■ కీళ్లు, మడిమలు, వేళ్లు, మట్టలు నొస్తున్నాయి. జ్వరం వస్తోంది..
– రాజేందర్, నిజామాబాద్

✤ వైరల్ ఫీవర్ కారణంగా కీళ్లు, మడిమలు, వేళ్లు, మట్టల నొప్పులు ఉంటున్నాయి. అవసరమైన మందులు వాడితే సరిపోతుంది. యాంటి బయోటిక్స్ ఎక్కువగా వాడవద్దు. పెయిన్ కిల్లర్లు ఎక్కువగా వాడితే కిడ్నీలు దెబ్బతింటాయి. విశ్రాంతి తీసుకుంటే నొప్పులు అవే తగ్గిపోతాయి.

■ డెంగీ నిర్ధారణ తరువాత ప్లేట్‌లెట్స్ తగ్గితే.. – గంగాధర్, నందిపేట

✤ డెంగీ పాజిటివ్ అనగానే భయపడొద్దు. ప్లేట్‌లెట్స్ తగ్గినా ఏమీకాదు. సాధారణంగా లక్షా 50వేల నుంచి 4 లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ఆ సంఖ్య 20వేల వరకు తగ్గితేనే భయపడాలి. ఆపైన ఎంత తగ్గినా మళ్లీ మూడు, నాలుగు రోజుల్లో పెరుగుతాయి.

■ జ్వరం వచ్చినప్పుడు ప్రాణాపాయం నుంచి ఎలా బయటపడాలి.. – కిశోర్, వేల్పూర్

✤ ఒళ్లు నొప్పులతోపాటు విపరీతమైన జ్వరం ఉంటే వైద్యులను సంప్రదించాలి. డెంగీ బారినపడిన వారిలో నీటిశాతం తగ్గి ఇబ్బందులు వస్తాయి. కాబట్టి తగిన మోతాదులో జ్యూస్‌లు తాగుతూ మంచి ఆహారం తీసుకోవాలి.

■ నాలుకపై కురుపులు వచ్చాయి.. పసిరికలా..
– చిన్నాజీ, వినాయక్‌నగర్

✤ శరీరంలో వేడి కారణంగా కూడా నాలుకపై కురుపులు వస్తుంటాయి. దీనికి జాండీస్(పసిరకలు)తో ఎలాంటి సంబంధం లేదు. వైద్యుల సలహా తీసుకోండి.

■ సీజనల్ వ్యాధుల నివారణపై మహిళా సంఘాలకు ఏ విధంగా అవగాహన కల్పించాలి..
– కుంట గంగాధర్, డీఆర్డీఏ ఉద్యోగి, భీమ్‌గల్

✤ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్, పెట్రోల్ వేసి దోమలను నివారించొచ్చు. పశువులు తాగే నీటి హైవేట్స్ స్ప్రే చేయాలి. మహిళలకు అవగాహన కల్పిస్తే ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా మారుతాయి. తద్వారా సీజనల్ వ్యాధులను నివారించొచ్చు.

## క్లుప్తంగా

### క్రీడాకారుల ఎంపిక



**ఆర్మూర్‌టౌన్:** పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా సబ్ జూనియర్ టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించినట్లు టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా సబ్ జూనియర్ పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, పీడీలు ఈర్ల భూపతి, ఉపాధ్యాయులు భూమేశ్, నర్సయ్య, రాజేందర్, శ్రీనివాస్, ప్రసాద్, త్రిష, ప్రసన్న, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

### అ'పూర్వ' సమ్మేళనం



**నిజామాబాద్ రూరల్:** మండలంలోని గుండారం ఉన్నత పాఠశాలలో 1973–74లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమానికి ముందుగా 12 మంది విద్యార్థుల్లో ఇద్దరు విద్యార్థులు మృతి చెందగా వారికి నివాళుర్పించారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### బీఈడీ పరీక్షల ఫీజు చెల్లించండి

**తెయూ(డిచ్‌పల్లి):** తెయూ పరిధిలోని బీఈడీ రెగ్యులర్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫీజును సెప్టెంబర్ నాలుగవ తేదీ లోపు చెల్లించాలని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ మంగళవారం పేర్కొన్నారు. రూ.వంద అపరాధ రుసుముతో సెప్టెంబర్ ఐదు వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

### బాల్కొండలో నెమలి మృతి

**బాల్కొంద:** మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల సమీపంలో మంగళవారం నెమలి మృతి చెందింది. డిప్యూటీ రేంజ్ అధికారి రణవీర్ తెలిపిన వివరాల ప్రకారం.. మోడల్‌పాఠశాల సమీపంలోని కొండ ప్రాంతంలో మృతి చెందిన నెమలి కళేబరం కనిపించడంతో స్థానికుల ద్వారా సమాచారం అందుకుని పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం వెటర్నరీ వైద్యుడితో పోస్టుమార్టం నిర్వహించినట్లు పేర్కొన్నారు. నెమలి సహజ మరణంగానే మరణించినట్లు నివేదిక వచ్చిందని అధికారి తెలిపారు.

### రెండు ఆటోలు ఢీ: పలువురికి గాయాలు

**ఖలీల్‌వాడి:** నగరంలోని ఆరో పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగపూర్ డైరీఫాం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు మంగళవారం ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఎస్సై వెంకట్రావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి బాసర వైపు వెళ్తున్న ప్యాసింజర్ ఆటో బాసర నుంచి నిజామాబాద్ వస్తున్న ఆటో సారంగపూర్ డైరీఫాం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు ఆటోల్లో ఉన్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

### ఖానాపూర్‌లో ఒకరి అదృశ్యం



**నిజామాబాద్ రూరల్:** రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన పసుపుల మైపాల్ ఈనెల3న అదృశ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ మంగళవారం తెలిపారు. మైపాల్ మేస్త్రిరి పనిచేస్తూ జీవిస్తుంటాడు. ఈ నెల 3న పని నిమిత్తం ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. కుటుంబీకులు బంధువులు, పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. బాధిత కుటుంబీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**రుద్రూర్:** కోటగిరి మండల కేంద్రం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను మంగళవారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ట్రాక్టర్లను పీఎస్‌కు తరలించి తగు చర్య నిమిత్తం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# 'సమగ్ర' ఉద్యోగుల పోరుబాట

- రెగ్యులరైజ్ కోసం ఏళ్లుగా నిరీక్షణ
- ఇప్పటికే చలో అసెంబ్లీ చేపట్టిన ఉద్యోగులు
- నేడు కలెక్టర్ ఎదుట ధర్నాకు పిలుపు



నందిపేటలో మంగళవారం సమావేశం అనంతరం నినాదాలు చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

**ఆర్మూర్/నందిపేట్:** విద్యారంగంలో కీలక పాత్ర పోషించే సమగ్ర శిక్షా అభియన్ ఉద్యోగులు పోరుబాట పట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. నెలల తరబడి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సమగ్ర శిక్షా విభాగంలో నిజామాబాద్ జిల్లాలో 910 మంది పనిచేస్తున్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జిల్లాలో భారీ సంఖ్యలో బుధవారం రోజున శాంతి యుతంగా ర్యాలీ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వానికి తమ నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా బుధవారం నాటి నిరసన కోసం సామూహిక సెలవులు తీసుకుంటూ అధికారులకు మంగళవారం లీవ్ లెటర్లు అందజేశారు.

| జిల్లాలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు | |
|---|---|
| కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది | 571 |
| యూఆర్ఎస్ బోధన, బోధనేతర సిబ్బంది | 10 |
| డీపీవో సిబ్బంది | 09 |
| ఎంఐఎస్ సమన్వయకర్తలు | 22 |
| సీపీవోలు | 29 |
| సీఆర్పీలు | 94 |
| ఐఈఆర్పీలు | 49 |
| మెసేంజర్లు | 19 |
| పీటీఐలు | 88 |
| సీజీవీలు | 19 |
| మొత్తం | 910 |

### నేడు మహా ర్యాలీ

**నిజామాబాద్‌అర్బన్:** రెగ్యులర్ చేయడంతో పాటు బేసిక్ పే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బుధవారం మహార్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఉన్న ధర్నాచౌక్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలుపుతామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### న్యాయం చేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షా పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి. మా శ్రమను ఇప్పటికైనా గుర్తించి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలి. – కె రాజు, ఎస్ఎస్ఏ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

### షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలి



ఎస్ఎస్ఏ ఉగ్యోలగుల సమస్యలను ఆందోళనల రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నాం. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నాం, ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలి.

– గంగామణి, ఎస్ఎస్ఏ జిల్లా మహిళా అధ్యక్షురాలు

## క్రైం కార్నర్

# వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

**కరెంట్‌షాక్‌తో రైతు ..**



మ్యాదరి సాయిరాం(ఫైల్)

**నిజాంసాగర్(జుక్కల్):** వ్యవసాయ బోరుమోటార్ స్టార్టర్‌కు కరెంట్ వైర్లను సరి చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మ్యాదరి సాయిరాం (45) అనే రైతు సోమవారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నిజాంసాగర్ మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన మ్యాదరి సాయిరాం తన వ్యవసాయ బోరు మోటార్ వద్దకు ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. భార్య సుశీల గ్రామస్తుల సహకారంతో వ్యవసాయ పొలానికి వెళ్లి చూడగా సాయిరాం చేతిలో కరెంటు వైరు ఉండి మృతి చెంది ఉన్నాడు. విషయాన్ని గ్రామస్తులు ట్రాన్స్‌కో అధికారులకు, పోలీసులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. ఎస్సై సుధాకర్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

**బైక్‌పై నుంచి పడి ఒకరు.**



సర్దార్ మృతదేహం

**ఎల్లారెడ్డిరూరల్:** ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడి ఒకరు మృతి చెందిన ఘటన మండల శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమర్యాగడి తండాకు చెందిన అజ్మీరా సర్దార్(45) పనినిమిత్తం మంగళవారం బాన్సువాడ వెళ్లాడు. పని ముగించుకొని స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎల్లారెడ్డి శివారులో బైక్‌పై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**అనారోగ్యంతో వివాహిత..**



అర్చన(ఫైల్)

**తాడ్వాయి:** అనారోగ్యంతో ఓ వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని బ్రహ్మజీవాడలో చోటు చేసుకుంది. గ్రామస్తులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మజీవాడకు చెందిన పడిగె అర్చన(24), ఎర్రపహాడ్‌కు చెందిన రవితేజ ఐదు నెలల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నారు. వీరి వాహానికి ఇరుకుటుంబాలు అంగీకరించాయి. వివాహమైన కొన్ని రోజులకు అర్చన అనారోగ్యానికి గురికావడంతో కామారెడ్డిలో వైద్యం చేయించారు. అనారోగ్యానికి గురైన నాటి నుంచి భర్త రవితేజ, అత్తామామలు చూడటానికి రాకపోవడం, ఫోన్ చేసినా మాట్లాడక పోవడంతో మనోవేదనకు గురై ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఉదయం మృతి చెందింది. అర్చన మృతిపై ఇరుకుటుంబాల్లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని సముదాయించారు. అనంతరం అంత్యక్రియలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎవరూ కేసు న మోదు చేయలేద నిఎస్సైతెలిపారు.

### మట్కా స్థావరంపై దాడి

**ఖలీల్‌వాడి:** నగరంలోని మిర్చి కాంపౌండ్ ప్రాంతంలో ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న మహమ్మద్ ముజాహిద్, షేక్ హమీద్, షేక్ నాజర్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు మంగళవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. మట్కా ఆడుతున్నట్లు సమాచారం అందడంతో టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం బృందంతో కలిసి దాడి చేసి వారిని అరెస్ట్ చేశారు. మట్కా ఆడుతున్న వారి నుంచి రూ.29,690 నగదు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని వన్ టౌన్ పీఎస్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### ఆలయానికి వెళ్తున్న వ్యక్తిపై..

**కామారెడ్డి క్రైం:** ఆలయానికి వెళ్లి వస్తున్న ఓ వ్యక్తిని మరో నలుగురు దాడి చేసిన ఘటన విద్యానగర్ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన విశ్వనాథం అనే వ్యాపారి అదే కాలనీలో ఉన్న శివాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా దేవునిపల్లికి చెందిన లక్ష్మీబాయి, మరో ముగ్గురు ఎదురుపడ్డారు. చాలా రోజులుగా విశ్వనాథం, లక్ష్మీబాయిల మధ్య భూతగాదాలు, ఆర్థిక లావాదేవీల గొడవలు ఉన్నాయి. మాటా మాటా పెరిగి నలుగురు కలిసి తనపై దాడి చేశారని విశ్వనాథం పేర్కొన్నారు. స్థానికులు అడ్డుకుని గాయపడిన విశ్వనాథాన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు.

### గంజాయి పట్టివేత



**ఖలీల్‌వాడి:** నిజామాబాద్, నవీపేట్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. నిజామాబాద్‌లో ఇద్దరు గంజాయిని విక్రయిస్తుండగా వారి నుంచి 450 గ్రాముల ఎండు గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు, నవీపేట్‌లో ఒకరిని అదుపులోకి తీసుకోగా 250 గ్రాముల ఎండు గంజాయి, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ వెంకటేశ్, ఎస్సై నరసింహ చారి, సిబ్బంది ఉన్నారు.

### అదృశ్యమైన వ్యక్తి అప్పగింత

**ఎడపల్లి:** అదృశ్యమైన వ్యక్తిని పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై వంశీచందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 23న భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్నట్లు సెల్‌ఫోన్ ట్రేస్ ద్వారా తెలుసుకున్న పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్ పోలీసుల ద్వారా అతన్ని పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### బాల్కొండలో చైన్ స్నాచింగ్

**బాల్కొండ:** మండల కేంద్రంలో దుండగులు మంగళవారం ఉదయం చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. వివరిలాలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వనజ ఉదయం తన పిల్లలను స్కూల్‌లో దింపేందుకు వెళ్లింది. కాలినడకన ఇంటికి వస్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను మెరుపు వేగంలో వచ్చి తెంపుకు పోయారు. బాధితురాలు అరిచే సమయంలోగా వారి పారిపోయారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు పేర్కొన్నారు.

### డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

**రుద్రూర్:** మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఒక రోజు జైలు శిక్ష విధించారని ఎస్సై సాయన్న మంగళవారం పేర్కొన్నారు. ఈ నెల 20న మండలంలోని రుద్రూర్–కోటగిరి రోడ్డుపై పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా మద్యం సేవించి ఫోర్ వీలర్‌పై వస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ ఒకరోజు జైలు శిక్షను విధించినట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వా హనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పని సరిగా హెల్మెట్ ధరించారిన ఎస్సై కోరారు.

### యూపీఐ మోసాలకు పాల్పడిన యువకుడి అరెస్ట్

**ఖలీల్‌వాడి:** నగరంలోని పలు షాపుల్లో ఫేక్ యూపీఐ లావాదేవీలు చేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన షేక్ అమర్ అనే యువకుడు నగరంలోని పలు మొబైల్ దుకాణాల్లో ఫోన్‌లు కొనుగోలు చేశాడు. అనంతరం డబ్బులను ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా ఫేక్ యూపీఐ లావాదేవీలు జరిపాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఇలా రూ. 57 వేలు మోసగించినట్లు పేర్కొన్నారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### తాడ్కోల్‌లో బైక్ చోరీ

**బాన్సువాడ రూరల్:** మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన మొహ్మద్ హుస్సేన్ ఈనెల 19న తన ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీకి గురైనట్లు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 19న బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులను పరామర్శించి ఇంటికి చేరుకున్నాడు. రాత్రి ఇంటి ఎదుట బైక్ పార్క్ చేసి నిద్రించాడు. ఉదయం లేచి చూసే సరికి బైక్ చోరీకి గురైందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ పేర్కొన్నారు.

### పోలీసుల విధుల పరిశీలన

**ఖలీల్‌వాడి :** రాష్ట్ర ఇంటలిజెన్స్ డీజీ ఆదేశాలమేరకు ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్(ఐఎస్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో పోలీసుల విధులను ఐఎస్‌డబ్ల్యూ డీఎస్పీ నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ సూచనల మేరకు పీఎస్‌వోలు, బీడీ టీం, డాగ్ స్క్వాడ్, ఎంటీ విభాగాలను పరిశీలించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ డి శంకర్ నాయక్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ హెచ్ సతీశ్, ఎంటీవో తిరుపతి, ఆర్ఎస్సై శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

### నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

**కామారెడ్డి క్రైం:** దేవునిపల్లి పీఎస్ పరిధిలోని పాత కలెక్టరేట్ వద్ద పోలీసులు మంగళవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్ లేనివి, సక్రమంగా లేని 10 వాహనాలను సీజ్ చేశారు. దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### డంప్ చేసిన ఇసుక స్వాధీనం

**రుద్రూర్:** పొతంగల్ మండలం సుంకినిలో అక్రమంగా డంప్ చేసిన 13 ట్రాక్టర్ల ఇసుకను మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని కోటగిరి పీఎస్‌కు తరలించారు. ఇసుకను బుధవారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు.

### తాడ్‌బిలోలిలో ఆవు దొంగతనం

**రెంజల్:** మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో గుర్తు తెలియని దొంగలు సోమవారం రాత్రి మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రావుకు చెందిన ఆవును దొంగిలించారు. మండలంలో ఆవుల దొంగతనాలు పెరుగుతున్నాయి. వీరన్నగుట్టలో రోడ్డుపై నిద్రిస్తున్న 12 ఆవులను, బోర్గాంలో 5 ఆవులను ఇప్పటి వరకు దొంగలు ఎత్తుకెళ్లారు.

### ముగ్గురి అరెస్ట్

**కామారెడ్డి క్రైం:** పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో చిత్తు బొత్తు ఆడుతున్న ముగ్గురిని దేవునిపల్లి పోలీసులు మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. వారి నుంచి రూ.1300, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# వైద్యులు అందుబాటులో ఉండాలి



బాలుడితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**ఆర్మూర్‌టౌన్:** ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తూ వారికి అందుబాటులో ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రికి ప్రతిరోజు కుక్క, కోతులు, పాము కాటుకు గురైన వారు ఎంత మంది వస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓపీ, ఐపీ రిజిష్టర్‌ను, వైద్యుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. టైఫాయిట్, డెంగీకు సంబంధించిన పరీక్ష కిట్‌లు అందుబాటులో ఉన్నాయని ప్రజలు భయాదాల్సిన అవసరం లేదన్నారు. ఆస్పత్రిలో అన్నివిధాల సేవలు అందించడానికి వైద్యులు సిద్ధంగా ఉన్నారని, ప్రజలు ఏరియా ఆస్పత్రిని సద్వినియోగం చేసుకోవాన్నారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, వైద్యులు మోహన్, అమృతరాం రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఐఈవో రవి కుమార్

**ఆర్మూర్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల అభ్యున్నతికి అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవి కుమార్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులతో సమావేశమై కళాశాలలలో అడ్మిషన్ల ప్రక్రియ, ఆన్‌లైన్ నమోదు, విద్యార్థుల ఫొటోలు, సంతకాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే పలు అంశాలపై సమీక్షించారు. రెండు కళాశాలల అడ్మిషన్లు, అకడమిక్‌పై పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించారు. కళాశాలల్లో మొక్కలు నాటి సంరక్షించేలా చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. విద్యార్థులు క్రమశిక్షణ పాటిస్తూ ప్రతిరోజు కళాశాలకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశాల్లో ప్రిన్సిపాళ్లు విజయేందర్‌రెడ్డి, నుస్రత్ జహాన్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధునిక వైద్యంతో పక్షవాతానికి చెక్

- పని ఒత్తిడి జీవన విధానమే పెరాలసిస్‌కు కారణం
- ప్రముఖ ఇంటర్వెన్షనల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఒజ్జల విష్ణువర్ధన్



ఒజ్జల విష్ణువర్ధన్

**నిజామాబాద్‌నాగారం:** జిల్లా కేంద్రంలో ఆధునిక వైద్యంతో పక్షవాతానికి చెక్ పెట్టవచ్చని ప్రముఖ ఇంటర్వెన్షనల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఒజ్జల విష్ణువర్ధన్ పేర్కొన్నారు. నగరంలోని ఖలీల్‌వాడీలో ఉన్న విజయ్ ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పక్షవాతం వయస్సుకు సంబంధం లేకుండా అందరికి వస్తోందని ఇలాంటి పెరాలసిస్ వచ్చిన వారికి జిల్లా కేంద్రంలోనే అత్యాధునిక వైద్యంతో నాలుగు గంటల్లోనే నయం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రక్తప్రసరణ మన శరీరంలో సాధారణంగా జరిగితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అన్నారు. రక్తప్రసరణలో ఇబ్బందులే పక్షపాతానికి కారణమవుతాయన్నారు. ఒకప్పుడు ఈ పెరాలసిస్ వృద్ధులకు మాత్రమే వచ్చేదని ప్రస్తుతం 30 నుంచి 40 ఏళ్ల వారికి కూడా పక్షవాతం వస్తోందన్నారు. మనిషి తీసుకునే ఆహారం, బీపీ, షుగర్, ధూమపానం, మద్యపానం, ఒత్తిడి కారణంగా రక్తంలో కోలెస్ట్రాల్ పెరిగి రక్తం చిక్కగా అయినప్పుడు ఎక్కడో ఒక దగ్గర రక్తం గడ్డకడుతుందన్నారు. తద్వారా ఎడమ చేయి, ఎడమకాలు పనిచేసే వద్ద బ్రెయిన్‌లో రక్తం గడ్డకడితే పనిచేయవన్నారు. దీంతో పక్షవాతం రావడంతోపాటు కంటిచూపు కూడా పోయే అవకాశం ఉందన్నారు. చిన్నమెదడులో రక్తం గడ్డకడితే తలతిరిగినట్లు, వాంతులు, మతిమరుపు వంటివి వస్తాయన్నారు. దీంతో మనిషి కాలు, చేయి పడిపోయి ఆకస్మత్తుగా మూతివంకర స్పర్శ తేలకపోవడం, నడుస్తుండగా తూలడం జరుగుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక వైద్యంతో చికిత్స చేస్తే నాలుగు గంటల్లోనే సాధారణ మనిషిలా ఉంటారన్నారు. బ్రెయిన్ ఎన్జోగ్రామ్, బ్రెయిన్ స్టోన్, బ్రెయిన్ కార్బయిడ్ ఇలాంటి పద్ధతులతో మంచి వైద్యం అందించవచ్చన్నారు. ఇలాంటి ఖరీదైన వైద్యాన్ని హైదరాబాద్‌లో కాకుండా నిజామాబాద్‌లోనే తక్కువ ధరకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై రాజు

**కామారెడ్డి క్రైం:** తాళం వేసిన ఇంట్లో జరిగిన ఓ చోరీ కేసులో హైదరా చెందిన ఓ నేరస్తుడిని దేవునిపల్లి పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దేవునిపల్లి ఠాణాలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై రాజు వివరాలు వెల్లడించారు. ఈ నెల 17న పట్టణంలోని గోష్కు రాజయ్య కాలనీకి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి ఇంజమూరి రాములు ఇంట్లో చోరీ జరిగింది. బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురి కావడంతో బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదైంది. నర్సన్నపల్లి శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న హైదరాబాద్‌కు చెందిన మీర్ కజామ్ అలీ ఖాన్ అలియాస్ సూర్య బాయ్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ వ్యవహారం బయటపడింది. గోష్కు రాజయ్య కాలనీలో చోరీ చేసినట్లు అంగీకరించడంతో అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అతని నుంచి రూ.1.43 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితుడిపై హైదరాబాద్ కమిషనరేట్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఇప్పటికే 102 కేసులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

# వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

**ప్రేమ విఫలమై ఓ యువకుడు..**

**ఖలీల్‌వాడి:** ప్రేమించిన అమ్మాయి దక్కలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కుమార్‌గల్లీలో నివాసం ఉండే రయ్యత్ సునీల్(22) తన మేనత్త కుమార్తెను ప్రేమించాడు. సదరు యువతి సైతం యువకుడిని ప్రేమించింది. గత రెండు నెలలుగా వీరి మధ్య మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో యువతి సునీల్‌పై మూడో టౌన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ప్రేమించిన అమ్మాయి దక్కడం లేదనే మనస్థాపంతో సునీల్ కుమార్‌గల్లీలో ఉండే తన దుకాణంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

**కడుపు నొప్పి తాళలేక..**

**బాన్సువాడ రూరల్:** కడుపు నొప్పి తాళలేక ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేశాయిపేట్ గ్రామానికి చెందిన కొత్మీర్‌కర్ బాలన్(66)కు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నెల 24న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఆచూకీ కోసం వెతుకుతుండగా మంగళవారం సోమేశ్వర్ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**గన్నారంలో వృద్ధుడు..**

**ఇందల్వాయి:** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గన్నారంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోజ్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేల్పూర్ సాయన్న(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సాయవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# వరకట్నం వేధింపు కేసులో భర్తకు జైలు

**ఎడపల్లి:** అదనపు వరకట్నం కోసం వేధించిన కేసులో భర్తకు రెండున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ బోధన్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఈ సాయి శివ తీర్పును మంగళవారం వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాణి తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలంలోని ఠానాకలాన్‌కు చెందిన లావణ్యకు నవీపేట మండలం మల్కాపూర్‌కు చెందిన ఎర్రోళ్ల రవితో 2015లో వివాహమైంది. వివాహమైన ఐదు నెలల అనంతరం అదనపు కట్నం, కల్యాణ లక్ష్మి పథకానికి సంబంధించి రూ. 50 వేలు తీసుకురావాలని భర్త, అత్తామామలు లావణ్యను వేధించారు. దీంతో ఆమె తల్లిదండ్రులు కల్యాణ లక్ష్మి పథకం డబ్బులు ఇచ్చి అత్తారింటికి పంపించారు. ఆ తర్వాత కొన్ని రోజులకు ట్రాక్టర్ కొనుగోలుకు రూ.లక్ష పుట్టింటి నుంచి తీసుకురావాలని భర్త, అత్తామామలు, ఆడపడుచు, ఆమె భర్త మానసికంగా వేధింపులకు గురి చేసి, 2016 జూన్‌లో లావణ్యను ఇంటి నుంచి వెళ్లగొట్టారు. నాటి నుంచి ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. తర్వాత రెండు దఫాలు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా రూ .లక్ష ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పారు. 2016 డిసెంబర్ 4న ఎడపల్లి పీఎస్‌లో లావణ్య ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో విచారణ సాగింది. భర్తకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

### పేకాట స్థావరంపై దాడి

**లింగంపేట:** మండలంలోని నల్లమడుగు అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకోగా మరో ఏడుగురు పరారైనట్లు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ. 37730 నగదు, 7 సెల్‌ఫోన్లు, 7 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.